నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 10 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఉమ్మడి జిల్లాలో 'రైల్వే' సమస్యలు పరిష్కరించాలి

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీఆర్ఎస్ ఎంపీల వినతి

ఖమ్మం, డిసెంబర్ 9: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు రైల్వే సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎంపీలు కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఢిల్లీలో సోమవారం కలిసి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఉప నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు మాట్లాడారు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి హైదరాబాద్‌కు కొవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని, అదనంగా మరికొన్ని రైళ్లను నడపాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలని కోరారు. అలాగే, గాంధీపురం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఎత్తు పెంచాలని, ఆధునీకరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కారేపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, గతంలో ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఖమ్మం స్టేషన్లో బీహార్, జైపూర్ వెళ్లే రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా మరికొన్ని సమస్యలను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి.. ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు

కేసీఆర్ దీక్ష ఫలించిన రోజిది..

అందుకే ఎప్పటికీ విజయదివస్‌గా విరాజిల్లుతుంది: ఖమ్మం మాజీ ఎంపీ నామా

ఖమ్మం, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చుకోవాలని చేసిన పోరాటంలో భాగంగా తెలంగాణ ఉద్యమనేత, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్ దీక్ష ఫలించిన రోజు డిసెంబర్ 9 అని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలే శ్వాసగా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఉద్యమం సాగిందని జ్ఞప్తికి తెచ్చారు. ఇందుకు తలవంచిన అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ఇదే రోజు ప్రకటించిందని గుర్తుచేశారు. అందుకే ఈ రోజు విజయదివస్‌గా విరాజిల్లుతుందని వివరించారు. నాడు 15వ లోక్‌సభలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న తాను పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశ పెట్టాలని పట్టుబట్టినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ఉద్యమస్ఫూర్తి, అమరుల త్యాగాలను నేటి తెలంగాణ సమాజం మరువరాదని ఆకాంక్షించారు.

అవినీతి జలగలు

- ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరుతున్న లంచావతారులు
- కాసుల కోసం సామాన్యులను పీల్చిపిప్పి చేస్తున్న ఉద్యోగులు
- పొందేది మంచి వేతనాలు.. చేసేది రోత పనులు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 15 కేసులు నమోదు

గవర్నమెంట్ ఆఫీసుల్లో కొంతమంది ఉద్యోగులు తమ వక్రబుద్ధి చూపిస్తూనే ఉన్నారు. నిరుపేదలు పనికోసం ప్రభుత్వ కార్యాలయం మెట్లెక్కితే చాలు.. పైసల కోసం పట్టుబడుతున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటును ఫిక్స్‌చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. చేయి తడపనిదే ఇసుమంత పని కూడా జరగడం లేదు. కనీసం రూ.10 అయినా ఇవ్వకుంటే అటెండర్ కూడా అధికారిని కలువనీయని పరిస్థితి దాపురించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ కన్నేసింది. అక్రమార్కుల భరతం పట్టేందుకు గుట్టుచప్పుడు కాకుండా విచారణ మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే లంచావతారులు వరుసగా పట్టుబడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 15 కేసులు నమోదవడమే ఇందుకు ఉదాహరణ.

- మామిళ్లగూడెం, డిసెంబర్ 9

'తెలంగాణను అవినీతి రహితంగా తీర్చిదిద్దుతాం.. ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజానీకానికి పారదర్శకంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం..' అంటూ ప్రకటించిన కాంగ్రెస్ ఏడాది పాలనలో అవినీతి జలగలు ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయి. రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడుతున్నప్పటికీ వేలాది రూపాయల వేతనాలు పొందుతున్న కొందరు ఉద్యోగులు తమ వంకర బుద్ధిని వీడడం లేదు. బ్యూరోక్రాట్స్ దగ్గర్నుంచి కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వరకు లంచం పుచ్చుకోనిదే పూటగడవని పరిస్థితి. ఈ విషయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మినహాయింపేమీ లేదు.

అవినీతికి ఆనవాళ్లుగా...

జిల్లాలో ప్రజలతో నేరుగా సంబంధమున్న గవర్నమెంట్ ఆఫీసుల్లో అవినీతి మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. మైనింగ్, ఆరోగ్య, ఆర్టీవో, రెవెన్యూ, విద్యుత్, రిజిస్ట్రేషన్స్, మున్సిపాలిటీ, పోలీసు, పంచాయతీరాజ్, కమర్షియల్ ట్యాక్స్, సంక్షేమ విభాగాలు తదితర శాఖల్లో అవినీతి పెచ్చుమీరింది. వీటితోపాటు విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించే శాఖల్లో సైతం అవినీతి వేళ్లునుకుని పోయింది. ఒక్కో దానికి ఒక్కో రేటును ఫిక్స్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. అలా వచ్చిన అవినీతి సొమ్ము నుంచి ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారుల వరకు పర్సంటేజీలుగా పంచుకు తింటున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్

వేతనాలు పెంచినా మారని తీరు..

ఉద్యోగుల సంక్షేమం కోసం ఎవ్వరికీ ఇవ్వని రాయితీలు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. తెలంగాణ వచ్చీరాగానే ఇంక్రిమెంట్, వారి భార్యాపిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్‌కార్డులు ఇచ్చారు. 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. కానీ ఇప్పుడొచ్చిన ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహిస్తుండడంతో అధికారులకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. దీంతో పనికోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలను లంచాల కోసం పీక్కుతింటూనే ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 15 కేసులు నమోదయ్యాయి.

లంచం అడిగితే ఒక్క ఫోన్ చేయండి..

అధికారులు లంచం అడిగితే ప్రజలు వెంటనే అవినీతి నిరోధక శాఖకు ఒక్క ఫోన్ చేస్తే చాలు స్పందిస్తాం. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్ ఫ్రీ నెంబర్ 1064పై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాం. లంచం ఇవ్వవద్దు. లంచం తీసుకోవద్దు. అవినీతి అనేది దేశాభివృద్ధికి తీవ్ర ఆటంకం. అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయం నెంబర్లు- 9154388989, 040-2325155 5, వాట్సప్ నెంబర్- 9440446106, ఈ-మెయిల్ dg_acb@telangana.gov.in ఖమ్మం రేంజ్ కార్యాలయం నెంబర్లు- 9154388981, 08742-228663, ఈ-మెయిల్ dsp_acb_kmm@telangana.gov.inను సంప్రదించవచ్చు.

- వై.రమేశ్, ఏసీబీ డీఎస్పీ, ఖమ్మం

ఏసీబీకి చిక్కిన ట్రెజరీ అకౌంటెంట్

- ఫ్యామిలీ పింఛన్, బెనిఫిట్ల మంజూరు కోసం లంచం డిమాండ్
- ఏసీబీకి బాధితుల ఫిర్యాదు.. వలపన్ని పట్టుకున్న డీఎస్పీ..

మామిళ్లగూడెం, డిసెంబర్ 9 : రిటైర్మెంట్ తర్వాత మరణించిన తన భర్త పింఛన్‌ను, ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర అలవెన్సులను మంజూరు చేయాలని కోరిన ఓ వితంతువును లంచం డిమాండ్ చేశాడు ఖజానా శాఖ సీనియర్ అకౌంటెంట్. దీంతో ఆమె అందించిన ఫిర్యాదు మేరకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు ఆ అధికారిని పట్టుకున్నారు. ఈ ఘటన సాక్షాత్తూ ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో అటెండర్‌గా చేసిన మెట్ట మల్లయ్య రిటైర్మెంట్ తరువాత మరణించాడు. దీంతో తనకు ఫ్యామిలీ పింఛన్ ఇవ్వాలని, అలవెన్సులను మంజూరు చేయాలని కోరుతూ మల్లయ్య భార్య జిల్లా ఖజానా కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. ఎన్ని రోజులు తిరిగినా ఆమె దరఖాస్తుకు పరిష్కారం లభించలేదు. దీంతో జిల్లా ఖజానా శాఖ పింఛన్ల విభాగ సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేశ్‌ను కలిసి తన బెనిఫిట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంది. ఆ తరువాత ఎన్ని సార్లు తిరిగినా దరఖాస్తుకు మోక్షం లభించలేదు. దీంతో ఆమెకు తిరిగే ఓపిక లేకపోవడంతో తనకు బదులుగా తమ బంధువైన ఓ యువకుడిని ఖజానా కార్యాలయానికి పంపింది. ఆమె విజ్ఞప్తి మేరకు ఆ యువకుడు వచ్చి సదరు ఖజానా శాఖ సీనియర్ అకౌంటెంట్ నగేశ్‌ను కలిశాడు. అందుకు నగేశ్ స్పందిస్తూ.. సుమారు రూ.4 లక్షల వరకు అలవెన్సులు వస్తాయని, అవి మంజూరు చేయాలంటే రూ.లక్షకు రూ.10 వేల చొప్పున రూ.4 లక్షలకు కలిపి రూ.40 వేలను తనకు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. బాధితుల ఫోన్ నుంచి నగేశ్‌కు కాల్ చేయించారు. అతడి మాటలను ఫోన్‌లో వాయిస్ రికార్డు చేయించారు. ఇలా ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడిన క్రమంలోనూ అతడు లంచం డిమాండ్ చేశాడు. వీటి ఆధారంగా నగేశ్‌ను ఏసీబీ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకొని విచారించారు. ఐడీవోసీలోని ఖజానా శాఖ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం నగేశ్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి ఖమ్మం జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ.. లంచం డిమాండ్ చేసినా, ఇచ్చినా, తీసుకున్నా నేరమే అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులుగానీ, ఉద్యోగులుగానీ లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. అయితే, ఐడీవోసీలో ఏసీబీ దాడులు జరగడం, ఖజానా శాఖ ఉద్యోగిని అరెస్టు చేయడం వంటి పరిణామాలతో కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

అసెంబ్లీలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఖమ్మం, డిసెంబర్ 9: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు, ప్రజాప్రతినిధులను అరెస్టు చేసిన విధానం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించి అసెంబ్లీకి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రానివ్వకుండా అడ్డుపడి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహరిస్తున్న నిరంకుశ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో..' అంటూ ఆమరణ దీక్ష చేసి కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ఒకవైపు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెబుతూ, మరోవైపు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలందించే ఆశ కార్యకర్తలపై దాడులు చేయడాన్ని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశ కార్యకర్తల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయహస్తం మ్యానిఫెస్టో పేజీ నెంబర్ 26లో హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీ అమలు చేయాలంటూ ఆశ అక్కాచెల్లెళ్లు రోడ్డెక్కితే పోలీసులతో ఇష్టారీతిన కొట్టించడం దుర్మార్గమని అన్నారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు సేవలందించే ఆశ కార్యకర్తలకు నిరసన తెలిపే హక్కు లేదా? సమస్యలు పరిష్కరించాలని అడిగే స్వేచ్ఛ లేదా?' అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 9: బాధితులు సమర్పించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. చండ్రుగొండ మండలం రావికంపాడులో పాఠశాల అదనపు గదుల నిర్మాణ బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్ భూపతి శ్రీనివాసరావు, సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన బానోత్ విజయకుమారి, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పాత పాల్వంచకు చెందిన లీలావతి, ఇల్లెందు మండలం గుండాల గ్రామానికి చెందిన కొమరయ్య తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులకే సంక్షేమ పథకాలు

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 9: అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే ఐటీడీఏ లక్ష్యమని పీవో రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి ఏపీవో డేవిడ్‌రాజ్ అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి.. మిగిలిన వాటిని ఆయా శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఎస్‌వో భాస్కర్, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, ఎస్‌డీసీ ఉదయ్‌కుమార్, డీటీఆర్‌వోఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, డిసెంబర్ 9: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలని ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్వో రాజేశ్వరితో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు చింతచెర్వు కోటేశ్వరరావు, కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన తోటకూరి భద్రమ్మ, ఏన్కూరు మండలం శ్రీరామగిరికి చెందిన లక్ష్మి, ఖమ్మం నగరంలోని పుట్టకోట ప్రాంతానికి చెందిన ఎస్‌కే సైదా, ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ సైదాబీ తదితరులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి బోధనకు బ్రేక్

- సమ్మెకు దిగుతున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు
- వారిలో అత్యధికులు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్..
- దీంతో కేజీబీవీల్లో భారీగా నిలిచిపోనున్న సేవలు
- కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్న సీఆర్‌పీలు
- రేవంత్ ఇచ్చిన హామీ ఎటుపోయిందంటూ ప్రశ్నలు

భద్రాద్రి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారుకు చిరుద్యోగులు చుక్కలు చూపిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీ ఎటుపోయిందంటూ ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏడాదికాలంగా వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విసుగు చెందిన చిరుద్యోగులు ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగుతున్నారు. ఈ మేరకు రోడ్డెక్కి రాస్తారోకోలు చేస్తున్నారు. కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నారు. హామీలను ఎందుకు అమలు చేయరంటూ నిలదీస్తున్నారు. 'దిగి వస్తారా? దిగిపోతారా?' అంటూ పెద్ద ఎత్తున నినదిస్తున్నారు. మొన్నటికి మొన్న ఆశా కార్యకర్తలు రోడ్డెక్కారు. ఇప్పుడు సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులూ అదేబాట పట్టారు. మూడు రోజుల క్రితం ఏకంగా దీక్షలు చేపట్టారు. మరో అడుగు ముందుకేసి సమ్మెకు సై అంటున్నారు. ఆ సంఘం నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఎస్ఎస్ఏలోని సీఆర్‌టీ, ఐఈఆర్‌టీ, ఐఆర్‌పీలు మంగళవారం నుంచి సమ్మెకు దిగుతున్నారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో ధర్నా చేసి సమ్మెకు పిలుపునిచ్చారు.

నేటి నుంచి నిలిచిపోనున్న బోధన..

విద్యాశాఖలో ఏళ్లకాలం నుంచి పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు రోడ్డెక్కడంతో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మంగళవారం నుంచి విద్యాబోధన నిలిచిపోనుంది. ముఖ్యంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), ప్రభుత్వ పాఠశాలలు, దివ్యాంగుల పాఠశాలల్లో బోధనకు, ఇతర సేవలకు తీవ్రంగా అంతరాయం కలుగనున్నది. భద్రాద్రి జిల్లాలోని ఎస్ఎస్ఏలో మొత్తంగా 706 మంది బోధనా సిబ్బంది తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్నారు. అసలే ఉపాధ్యాయుల కొరత ఉన్న ఈ పరిస్థితుల్లో ఇప్పుడు వీరు సమ్మెకు దిగడంతో పాఠాల బోధన నిలిచిపోతోంది.

హామీ ఎటుపోయిందంటూ ప్రశ్న..

నిరుడు హనుమకొండ కేంద్రంగా ఎన్నికల హామీల్లో భాగంగా సర్వశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తానని రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది దాటింది. కానీ.. ఇంత వరకూ ఆ హామీని ఆయన నెరవేర్చలేదు. దీంతో ఏడాది కింద తమకు ఇచ్చిన హామీ ఏమైందంటూ ఎస్ఎస్ఏ తాత్కాలిక ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కనీసం టైం స్కేల్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మాట నిలబెట్టుకోవాలి..

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. లేకపోతే ఊరుకునేది లేదు. మాలాంటి చిరుద్యోగులను మోసగిస్తే మా ఉసురు తప్పకుండా తగులుతుంది. మాపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే మా సత్తా ఏమిటో చూపిస్తాం.

-భూక్యా మోహన్, టెక్నికల్ పర్సన్

ఆమరణ దీక్షలు చేస్తాం..

సమగ్ర శిక్షా అభియాన్‌లో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న మా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. లేకుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తాం. చిరుద్యోగులంటే ఏంటో చూపిస్తాం. ధర్నాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికల హామీలు నెరవేర్చడమంటే ఇదేనా?.

-పి.సిద్ధయ్య, ఐఈఆర్‌పీ

టైం స్కేలు ఇవ్వండి..

ఎస్ఎస్ఏలో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న మమ్ములను క్రమబద్ధీకరణ చేయండి. లేకపోతే కనీసం వేతనం అయినా ఇవ్వండి. 18 ఏళ్లగా చాలీచాలని జీతాలతో బతుకుతున్నాం. మాకు న్యాయం చేస్తామని, మమ్ములను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

-భట్టు చందర్‌లాల్, సీఆర్‌పీ

పరిశోధనాత్మకంగా ఆలోచించాలి: ఏసీ

ప్రారంభమైన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 9: విద్యార్థులు చిన్న తనం నుంచే పరిశోధనాత్మకంగా ఆలోచిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం నగరం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల (విక్రమ్ సారాబాయి ప్రాంగణం)లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది మానవుల నుంచి నేటి వరకు అన్ని ఆవిష్కరణలు సైన్స్ కారణంగానే జరిగాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే గుణాన్ని పెంపొందించుకోవాలన్నారు. మేడసాని శేషగిరిరావు రచించిన పాటకు విద్యార్థుల నృత్యం అద్భుతంగా ఉన్నదని, సైన్స్‌ని ఈ విధంగా చూపడం సంభ్రమాశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు. మరో అతిథి, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని, భవిష్యత్ అంతా సైన్స్‌తోనే ముడిపడి ఉందని అన్నారు. కాగా, ప్రదర్శనలో విద్యార్థులు మొత్తం 546 ఎగ్జిబిట్లు, 119 ఇన్‌స్పైర్‌లు ప్రదర్శించారు. వీటిలో పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, ఎంఈవోలు, సైన్స్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ పాఠశాలల బాధ్యులు పాల్గొన్నారు.